# వంతెన నిర్మాణం.. వెతలు దూరం


వీణవంక, రామకృష్ణాపూర్ గ్రామాల మధ్య నిర్మించిన వంతెన

- నాడు వానకాలం వస్తే రాకపోకలు బంద్
- నేడు మెరుగుపడిన రవాణా సౌకర్యం
- రూ.4.14 కోట్లతో పనులు
- ఆనందంలో రామకృష్ణాపూర్ ప్రజలు

వీణవంక, అక్టోబర్ 16: ఏండ్ల తరబడి వాగు నీళ్లల్లో మునిగితేలిర్రు. బతుకుజీవుడా అంటూ బొండిగెనంటే నీళ్లదాటి మండల కేంద్రానికి వెళ్లి పనులు చేసుకున్నారు. ఇది ఒకప్పుడు మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామ ప్రజల దుస్థితి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కోట్ల రూపాయలతో వంతెన నిర్మించడంతో ఇప్పుడు రవాణా సౌకర్యం మెరుగుపడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామకృష్ణాపూర్ నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే గ్రామ శివారులోని కుంటకట్ట దాటి చుట్టూ 8 కి.మీ.లు తిరిగి ప్రయాణించాల్సి వచ్చేది. ఎడ్ల బండ్లపై అంతదూరం ప్రయాణం చేయలేక, వరద తగ్గే వరకు ఉన్నదో లేందో తింటూ ఊళ్లోనే ఉండేవాళ్లు. విద్యార్థులు బడులకు వెళ్లలేక , కూలీలు పనులకు వెళ్లలేక బతుకు దెరువు భారమై నానా కష్టాలు పడేవారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి. ఎంతో మంది నాయకులు వచ్చారు.. హామీలు ఇచ్చి వెళ్లారు కానీ ప్రజల బతుకులు మాత్రం అలాగే ఉండి పోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ రామకృష్ణాపూర్ గ్రామ ప్రజల కష్టాలను అర్థం చేసుకొని ఎవరూ ఊహించని విధంగా వీణవంక-రామకృష్ణాపూర్ గ్రామాల మధ్య వాగుపై రూ.4.14 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టి, అనతి కాలంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. 80 ఏండ్లుగా గ్రామ ప్రజలు పడుతున్న కష్టాలను దూరం చేశారు. ఇప్పుడు ఆ గ్రామస్తులు ఏ కాలమైనా, ఏ సమయమైనా తమ గ్రామం నుంచి మండల కేంద్రానికి సాఫీగా రాకపోకలు జరుపుతున్నారు. వాళ్ల గోసను దీర్చిన సీఎం కేసీఆర్‌కు ఆనందంతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### మా బాధలు ఆ దేవుడు జూసిండు



మా ఊరు పుట్టిన కాడికెళ్లి మాగోస ఆ దేవుడికే తెలుసు. మాది చిన్న ఊరు. ఏది గావాలన్నా వీణవంకకు పోవాల్సి అచ్చేది. నెలనెలా పింఛిన్ దీసుకునెటోళ్లు, రేషన్ బియ్యం దీసుకునెటోళ్లు, రోజు బడికిపోయె పిల్లగాండ్లకు, యవుసం జేసుకునే రైతులకు కష్టాలు ఉండేటియి. జరమచ్చినా, రోగమచ్చినా , పిండిబత్తాలు (ఎరువులు) తెమ్మకోవాలన్నా వీణవంకకు ఎడ్ల బండి మీద పోయేటోళ్లం. ఎడ్లకు సామర్లుగట్టి (తాళ్లపట్టుకొని ముందు వెళ్తే వెనుక ఎడ్లు వచ్చే విధానం) బొండిగెలనంటే నీళ్లల వాగుదాటెటోళ్లం. ఎప్పుడు వరదచ్చి కొట్టుకపోతమోనని భయపడెటోళ్లం. కొంతమందియి ఎడ్లు బండి సహా కొట్టుక పోయినయి. మా గోస అంతా ఇంత గాదు. మా బాధలు ఆ దేవుడు జూసిండు. కేసీఆర్ సారు దయదలిచిండు 200 గడపలకు రూ.4 కోట్లు వెట్టి బ్రిడ్జి కట్టిచ్చిండు. మా కండ్ల తోని బ్రిడ్జి జూత్తమనుకోలేదు. కేసీఆర్ సారే మళ్ల సీఎం గావాలే.

**-అప్పని పాపయ్య, రామకృష్ణాపూర్ గ్రామస్తుడు**


రాగిజావ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్

# పేదలకు రాగిజావ ప్యాకెట్ల పంపిణీ

జమ్మికుంట, అక్టోబర్16: శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ హనుమకొండ జిల్లా కో-ఆర్డినేటర్ సుద్దాల భాస్కర్‌లింగం ఆధ్వర్యంలో స్థానిక శివాలయం ఆవరణలో పేదలకు సోమవారం ఉచితంగా రాగిజావ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌లింగం మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా ముద్దనహళ్లి కేంద్రంగా శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ పనిచేస్తున్నదని, ట్రస్ట్ వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదన్‌సాయి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు, నిరుపేదలకు ఉచితంగా రాగుల జావ పౌడర్ ప్యాకెట్లను అందిస్తున్నామని తెలిపారు. పలు రాష్ట్రాల్లో ఎంతో మంది వలంటీర్లుగా పనిచేస్తున్నామని, ట్రస్ట్ సూచించే సేవలను అందిస్తున్నామని చెప్పారు. జమ్మికుంటలో 200 మందికి ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. రాగుల జావతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. రాగుల జావ తయారీ, ఉపయోగాలు, తదితర విషయాలను వివరించారు. అనంతరం రాగుల జావ ప్యాకెట్లను అందుకున్న పేదలు అన్నపూర్ణ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ జయన్న, సురేశ్, రవీందర్‌రెడ్డి, కృష్ణ, వేణు తదితరులున్నారు.

# ప్రవక్త ఆదేశానుసారంగా జీవితం గడపాలి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 16: ముస్లింలు మహ్మద్ ప్రవక్త ఆదేశానుసారంగా తమ జీవితాలు గడపాలని మజ్లీసే తహఫూజె ఖత్మే నబువ్వత్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు మహ్మద్ అర్షత్ అలీ సూచించారు. హుజూరాబాద్ జామె మసీదులో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ముస్లింలు ఉద్దేశించి మాట్లాడారు. ముస్లింలు డబ్బులను వడ్డీకి తిప్పవద్దని, అప్పులు ఇవ్వడం, మిత్తి తీసుకోవడం చేయరాదని సూచించారు. అల్లా ఆదేశానుసారంగా ముస్లింలు అబద్ధం చెప్పరాదని, పిల్లలకు కురాన్ హదీస్ నేర్పించాలని, అల్లాహ్ ఆరాధన చేయాలని తెలిపారు. అంతకుముందు మొదటిసారిగా హుజూరాబాద్‌కు వచ్చిన ఆయనకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాల మసీద్ అండ్ ఈద్గా ఖబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ చైర్మన్ మహ్మద్ ముజాహిద్‌హుస్సేన్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మత పెద్దలు ముఫ్తీ మహ్మద్ గయాస్ మోహిద్దీన్, మహ్మద్ ముజాహిద్ హుస్సేన్, మిర్జా ఇమ్రాన్ బేగ్, ముఫ్తి షాకీర్, మౌలానా సోహెల్, మౌలానా నజీర్, మహ్మద్ సలీం, మౌలానా నయీం, ముషు, చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


మజ్లీసే తహఫూజె ఖత్మే నబువ్వత్ అధ్యక్షుడు మహ్మద్ అర్షత్ అలీకి స్వాగతం పలుకుతున్న మహ్మద్ ముజాహిద్‌హుస్సేన్

### కేసీఆర్ బీమా పేదలకు ధీమా

వీణవంక, అక్టోబర్ 16: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించిన అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టిందని, కేసీఆర్ బీమా బీపీఎల్ కుటుంబాల్లోని పేదలకు ధీమా కల్పించేలా ఉందని ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ విలేకరులతో మాట్లాడుతూ, దళితబంధు, గృహలక్ష్మి యథావిధిగా అమలు చేయడంతో పాటు రైతుబంధును రూ.16 వేలకు, ఆసరా పెన్షన్ రూ.5016కు పెంచడం గొప్పవిషయమన్నారు. అలాగే అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, రేషన్‌పై సన్నబియ్యం, పేద మహిళలకు రూ.3 వేలు, రూ.400కే సిలిండర్, తదితర అంశాలతో కూడిన మ్యానిఫెస్టో సకల జనం మెచ్చేలా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి మరోసారి బీఆర్ఎస్‌కే పట్టం కడతారని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని, హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

### 18న బీఆర్ఎస్ ప్రచార కార్యాలయం ప్రారంభం

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 16: పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ వద్ద ఈ నెల 18న బీఆర్ఎస్ ప్రచార కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సింగిల్ విండోల అధ్యక్షులు, డైరెక్టర్లు, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామాధ్యక్షులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

# కట్టుకాలువ పటిష్టం.. పంటలు భద్రం

- రూ.17 లక్షలతో వెన్నేపల్లి తుమ్మలచెరువు కట్టుకాలువకు మరమ్మతులు
- రైతులకు ఎంతో మేలు


మరమ్మతుల తర్వాత కట్టు కాలువ

సైదాపూర్, అక్టోబర్ 16: ఒకప్పుడు వరద వచ్చిందంటే మండలంలోని వెన్నేపల్లి తుమ్మలచెరువు కట్టుకాలువ తెగి పొలాల్లోని పంటలు కొట్టుకుపోయేవి. రైతులకు ఎంతో నష్టం వాటిల్లడంతో పాటు ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడేది. ఈ క్రమంలో ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించడంతో రైతులతో పాటు గ్రామీణులకు ఎంతో మేలు జరిగింది.

సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్నేపల్లి తుమ్మలచెరువు నిండినప్పుడు దాని మత్తడి ద్వారా వచ్చిన నీళ్లు కట్టుకాలువ ద్వారా ప్రవహించి పోల్కమ్మ చెరువులో కలుస్తాయి. పోల్కమ్మ చెరువు నిండినప్పుడు భారీ వరద ప్రవాహానికి కట్టుకాలువ తెగి సమీప పొలాల నుంచి వరద ప్రవహించేది. సైదాపూర్ ఊరవెరువులో కలిసేది. ఈ క్రమంలో భారీ వరదతో ప్రవాహానికి హుజూరాబాద్- హుస్నాబాద్ ప్రధాన రహదారిపై సైదాపూర్ కల్వర్టు నుంచి నీళ్లు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేవి. ఈ నీటి వల్ల సోమారం, ఆరెపల్లి గ్రామాల్లో కూడా పంటలు మునిగిపోయేవి. కట్టుకాలువ వల్ల రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించేదుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.17 లక్షల నిధులను కేటాయించడంతో కట్టుకాలువ మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో ఇటీవల భారీ వర్షాలు కురిసినా కట్టుకాలువకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కట్టుకాలువకు మరమ్మతులు చేయించడంతో పెర్కపల్లి, గూడెం, సర్వాయిపేట, శివరాంపల్లి గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి ఈ దారిగుండానే రాకపోకలు సాగిస్తున్నారు.

### సమస్య పరిష్కారమైంది



వెన్నేపల్లి తుమ్మలచెరువు కట్టుకాలువ తెగడం వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పనులు జరిగాయి. రైతులు, ఆయా గ్రామాల ప్రజల సమస్య పరిష్కరించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**- కొండం గణేశ్, వెన్నేపల్లి సర్పంచ్, (సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు)**

# రైస్‌మిల్ పనులు నిలిపివేయాలని రాస్తారోకో


చిన్నపాపయ్యపల్లిలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 16: మండలంలోని చిన్నపాపయ్యపల్లి గ్రామ సమీపంలో చేపట్టిన పారాబాయిల్డ్ రైస్‌మిల్ నిర్మాణ పనులు నిలిపివేయాలని గ్రామస్తులు సోమవారం కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న హుజూరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, గ్రామస్తులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, రైస్‌మిల్ అనుమతులు రద్దుచేసి, నిర్మాణ పనులు నిలిపివేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. రాస్తారోకోలో సుమారు రెండు వందల మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ విజయం ఖాయం

సైదాపూర్, అక్టోబర్ 16: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎస్సీ విభాగం మండలాధ్యక్షుడు ఎల్లంపల్లి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వరుసగా మూడోసారి హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని పేర్కొన్నారు.